# అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక


## తెలంగాణలో నాలుగు రోజులు వానలే.

అమృత్ తెలంగాణ: జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నాయి. దాంతో రాష్ట్రంలో భిన్న వాతావరణం ఏర్పడుతున్నది. పొద్దంతా ఎండలు దంచికొడుతుండగా.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం కురుస్తున్నది. మరో రాబోయే రెండురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండవని.. ఆ తర్వాత గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయని వాతావరణశాఖ తెలిపింది. అదే సమయంలో రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.


## వివాదంలో నిత్యహారతి

బాసర,అమృత్ తెలంగాణ:: బాసర పుణ్యక్షేత్రంలో గోదావరి వద్ద బాసర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం గోదావరి నిత్యహారతి కార్యక్రమం నిర్వహించే వారు. ఇంతకు ముందు నుంచి ప్రతి రోజూ బాసరలోని వేద పాఠశాల ఆధ్వర్యంలో గోదావరి నిత్యహారతి కార్యక్రమం నిర్వహించేవారు. ఈ ఘాట్ వద్ద కొన్ని రోజులుగా వివాదాలు కొనసాగుతుండడంతో ఇక్కడ ఈ కార్యక్రమాన్ని నిలిపివేశారు. అయినా వేద పాఠశాల నుంచి కమిటీలు ఏర్పాటు చేసి నిత్యహారతిని నిర్వహించాలని నిర్ణయించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నిర్వహించే హారతి కార్యక్రమంలో భాగంగా గత బుధవారం(ఏప్రిల్ 30)న ఆలయ అర్చకులు అక్కడ హారతి కార్యక్రమం నిర్వహించారు. వేద పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించే ఘాట్ వద్దనే నిర్వహించారు. దీంతో వేద పాఠశాల ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఇక్కడ ఎవరికీ ఆస్కారం లేకుండా తామే ట్రస్ట్ తరఫున నిర్వహిస్తున్నట్లు తెలిపి గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు.


సంపుటి: 01 సంచిక : 207. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ ఆదివారం.04.05.2025 పేజీలు:4, వెల:రూ.1.00


# భద్రత లేని భాగ్యనగరి.. కుటుంబంతో కలిసి స్వేచ్ఛగా బయటకు వెళ్లలేని పరిస్థితులు!

### భద్రతను గాలికొదిలిన సర్కారు
### పూటకోచోట అఘాయిత్యాలు
### కుటుంబంతో ఉన్న యువతిని వెంబడించి వేధించిన అకతాయిలు
### 'నన్నే నీ భర్తనుకో.. ఫోన్ నంబర్ ఇవ్వు' అంటూ భర్త ఎదుటే భార్యకు వేధింపులు.. బీరు బాటిళ్లు పట్టుకొని అటకాయింపు
### బేగంపేట నుంచి రహ్మత్‌నగర్ వరకు వెంటపడి భర్తపై దాడి
### ముగ్గురి అరెస్ట్ .. మధురానగర్ ఠాణాలో కేసు నమోదు




వెంగళరావునగర్, అమృత్ తెలంగాణ: హైదరాబాద్‌లో కామాంధులు బరితెగించారు. భర్త ఎదుటే భార్యను వేధించారు. 'నన్నే నీ భర్త అనుకో.. నీ ఫోన్ నంబర్ ఇవ్వు' అంటూ దారికి అడ్డంగా నిలబడి బీరు బాటిళ్లతో బెదిరించారు. భర్త, మరిది, ఆడపడుచుతో కలిసి పబ్‌కు వెళ్లి ఇంటికి తిరిగొస్తుండగా యువతిని వెంబడించారు. దౌర్జన్యానికి దిగి ఫోన్లతోపాటు బైక్‌ను లాక్కొని దాడికి పాల్పడ్డారు. బాధిత కుటుంబం డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో ముగ్గురు కామాంధులను కటకటాల్లోకి నెట్టారు పోలీసులు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన ఒక యువతి (29) తన భర్త, మరిది, ఆడపడుచుతో కలిసి రహ్మత్‌నగర్‌లోని తమ బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం సాయంత్రం ఆ యువతి తన భర్త, మరిది, ఆడపడుచు, తమ బంధువుల స్నేహితుడితో కలిసి బేగంపేటలోని క్లబ్–8 అనే పబ్‌కు వెళ్లారు. అనంతరం రాత్రి 11.40 గంటల సమయంలో పబ్ నుంచి బయటకు వస్తుండగా కామాంధులు అడ్డగించారు. తాను భర్తతో కలిసి వచ్చానని యువతి చెప్పగా.. 'నన్నే నీ భర్త అనుకో.. ఫోన్ నంబర్ ఇవ్వు' అంటూ వేధించారు. బీరు బాటిళ్లు చేతబట్టుకొని బెదిరించారు. బేగంపేట నుంచి రహ్మత్‌నగర్‌లోని ఇంటికొచ్చే వరకూ దారిపొడవునా ఆ కామాంధులు వెకిలిచేష్టలతో వెంబడిస్తూ వేధించారు. అనంతరం యువతిని ఇంట్లో దిగబెట్టిన ఆమె భర్త.. తన స్నేహితుడ్ని డ్రాప్ చేయడానికి మాదాపూర్ వెళుతుండగా.. ఆ ముగ్గురు వ్యక్తులు ఎస్ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ వద్ద అడ్డగించి దాడికి పాల్పడ్డారు. వారు ప్రయాణించే బైక్‌తోపాటు ఫోన్లను బలవంతంగా లాక్కున్నారు. డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. డీ సంపత్ (28), సందీప్ (28), ఉమేశ్ (28)లను అరెస్టు చేశారు.

**కట్టుకున్నోడే కడతేర్చాడు! బీ పిల్లల్లేరని, ఆస్తి తగాదాలతో నిత్యం వేధింపులు**

తమకు సంతానం లేకపోవడంపై కుటుంబ సభ్యుల నుంచి సూటిపోటి మాటలు, దానికితోడు అన్నదమ్ములతో ఆస్తి తగాదాలు.. అన్నింటికీ భార్యే కారణమని భావించిన భర్త ఆమెను కడతేర్చాడు. ఇంట్లోనే ఉరివేసి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. వారం తర్వాత తాళం పగులగొట్టిన పోలీసులకు ఇంట్లో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనకు సంబంధించి సీఐ నీలం రవి, ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాలకు చెందిర అవుదుర్తి మహేందర్‌కు, గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన మమత(35)తో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. ఉపాధి కోసం మమత, మహేందర్ కరీంనగర్‌లో అద్దెకు ఉంటున్నారు. గత సంవత్సరం కాలంగా అత్త, మామలు వజ్రవ్వ, లక్ష్మణ్, మరుదులు అనిల్, వెంకటేశ్‌లతో మమతకు వేధింపులు ఎక్కువయ్యాయి. మహేందర్ కూడా వారికి వంతపాడటం ప్రారంభించాడు.

ఆస్తి తగాదాతోపాటు సంతానం లేదంటూ మానసికంగా వేధిస్తూ వచ్చారు. ఈ క్రమంలో మహేందర్ తన భార్యను చంపాలని నిర్ణయించుకుని, గత నెల 26న ఆమెను కొడిమ్యాలలోని తమ ఇంటికి తీసుకొచ్చాడు. ఇంట్లో తాడుతో మెడకు ఉరి వేసి హత్య చేశాడు. సాయంత్రం మమత కనపడడం లేదంటూ వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. దీంతో గత నెల 28న కరీంనగర్‌లోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మమత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మహేందర్‌ను, అతని తల్లిదండ్రులను మమత గురించి నిలదీయగా దాటవేసే ప్రయత్నం చేశారు. అనుమానంతో శుక్రవారం కొడిమ్యాలలోని ఇంటి తాళాలు పగులగొట్టి చూడగా మమత మృతదేహం ఉన్నది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, సీఐ, ఎస్ఐ పరిశీలించి మృతదేహన్ని జగిత్యాల దవాఖానకు తరలించారు. మమత తల్లి రాచకొండ పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేందర్‌తోపాటు వారి తల్లిదండ్రులు, ఇద్దరు తమ్ముళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

# రైతు బీమా పథకాన్ని రేవంత్ సర్కార్ నిర్వీర్యం చేయడం దుర్మార్గం : హరీశ్‌రావు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఏ కారణంతో అయినా, రైతు మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడకుండా కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్వీర్యం చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఫిబ్రవరి నెలలోనే చెల్లించాల్సిన రూ. 775 కోట్ల ప్రీమియం మూడు నెలలుగా ప్రభుత్వం చెల్లించకపోవడం శోచనీయం అని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, రైతు కుటుంబాలకు శాపంగా మారుతున్నది. అసలు రాష్ట్రంలో రైతు బీమా పథకం కొనసాగుతున్నదా? లేదా అటకెక్కించారా అనే అనుమానం కలుగుతుంది. వానాకాలం రైతు బంధు ఎగ్గొట్టారు, యాసంగి పైసలు ఎప్పుడు ఇస్తారు అని మేము అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు.. మార్చి 31వ తేదీ లోగా మొత్తం చెల్లిస్తామని చెప్పి మాట తప్పారు. మొత్తంగా రైతు బంధు పథకాన్ని ప్రశ్నార్థకం చేశారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ హామీ విషయంలో మేము వెంటబడితే దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పారు. సగం మందికి కూడా రుణమాఫీ చేయకుండా రైతుల ఉసురుపోసుకున్నారు. ఇప్పుడు రైతు కుటుంబాలకు ధీమా ఇచ్చే రైతు బీమా పథకాన్ని లేకుండా చేస్తున్నారు. ఇంతకంటే అమానుషం ఏమైనా ఉంటదా? ఇది కచ్చితంగా రైతు వ్యతిరేక ప్రభుత్వమే. పాలన గాలికి వదిలేసి గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి, మంత్రులకు రైతు కుటుంబాల కన్నీళ్లు కనిపించడం లేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. వివిధ కారణాలతో గడిచిన మూడు నెలల్లో సుమారు వందకు పైగా రైతులు చనిపోయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో ఆయా కుటుంబాలకు రైతు బీమా సాయం అందకుండా పోయింది. ఒకవైపు కుటుంబ పెద్దను కోల్పోయి, మరోవైపు రైతు బీమా అందక ఆ కుటుంబాలు తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నాయి. రైతు కుటుంబాలకు ప్రభుత్వమే రూ. 5 లక్షలు చెల్లించి, ఎల్ఐసీకి పెండింగ్‌లో ఉన్న ప్రీమియం తక్షణం కట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో తాగునీటి కోసం జనం తిప్పలు.. మిషన్ భగీరథ నిర్వహణ లోపంతో ఇక్కట్లు



సంగారెడ్డి మే 3:అమృత్ తెలంగాణ: వేసవి తాపానికి తోడు తాగునీటికష్టాలతో సంగారెడ్డి జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓవైపు ఎండలు మండుతుంటే మరోవైపు గుక్కెడు నీటి కోసం ప్రజలు తిప్పలు పడాల్సివస్తోంది. మిషన్ భగీరథ పథకం నిర్వహణ లోపం ప్రజలకు శాపంగా మారుతుంది. మిషన్‌భగీరథ నిర్వహణ లోపం కారణంగా నారాయణఖేడ్, సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ నియోజకవర్గాల్లోని గ్రామాలు, తండాల్లోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సివస్తోంది. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు గ్రామాలు, తండాలకు రెండురోజులకు ఒకమారు తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు, తండావాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు సరఫరా కానిరోజు ప్రజలు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. అయితే జిల్లాలో భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. జిల్లాలో 15.47 మీటర్ల లోతుకు భూగర్భజలమట్టాలు చేరుకున్నాయి. కంగ్టి మండలంలో అత్యధికంగా 27 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. దీంతో నారాయణఖేడ్ ప్రాంతంలో భూగర్భజలమట్టాలు తగ్గి వ్యవసాయబోర్లు, తాగునీటిబోర్లు సైతం ఎండిపోతున్నాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సివస్తుంది.

**నారాయణఖేడ్‌లో నీటి తిప్పలు అధికం**

జిల్లాలో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ప్రజలు ఎక్కువగా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలు దాహార్తి తీరేలా మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్‌లు ఇచ్చారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్‌భగీరథ పథకాన్ని సక్రమంగా నిర్వహించకపోవడంతో నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలు నీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. కరెంటు కోతలకు తోడు మిషన్‌భగీరథ పైప్‌లైన్‌లు తరచూ పగిలిపోవటంతోపాటు లీకేజీలు అవుతున్నాయి. మిషన్ భగీరథ సిబ్బంది వెంటనే స్పందించి మరమ్మతులు చేయకపోవటంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నారాయణఖేడ్ పట్టణంలోని పలు వార్డులతో పాటు కంగ్టి, నాగల్‌గిద్ద, సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లోని పలు గ్రామాలకు మిషన్‌భగీరథ నీళ్లు రెండురోజులకు ఒకమారు సరఫరా అవుతున్నాయి. నాగల్‌గిద్ద మండలంలోని కుబ్బాతండా, గంగారం తండా, ఇరక్‌పల్లి తండాతోపాటు చుట్టుపక్కల ఉన్న పది తండాలకు రెండురోజులకు ఒకమారు తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారు.

# అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్



హిమాయత్ నగర్, మే3:అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం హిమాయత్ నగర్‌లోని ఆదర్శబస్తీలో ఉన్న 602 రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే దానం నాగేందర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్ విజయారెడ్డి తో పాటు అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీ కుటీర్ బస్తీలో లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడు..తూ కుటుంబ సభ్యులు పెరిగిన రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేస్తామని తెలిపారు. నగరంలో ఎన్నికల కోడ్ ఉండటం వల్ల గత నెల సన్న బియ్యం పంపిణీ చేయలేకపోయామని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం అందజేస్తామని స్పష్టం చేశారు. హిమాయత్ డివిజన్‌లోని ఆదర్శ బస్తీలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం సంద ర్భంగా ప్రొటోకాల్ రగడ నెలకొంది. ఖైరతాబాద్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి ఫొటోను ఫ్లెక్సీపై పెట్టకపోవడంతో ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై ఆమె అసహనం వ్యక్తం చేశారు. సన్న బియ్యం పంపిణీ చేస్తున్న క్రమంలో దానం పక్కన విజయారెడ్డి నిలబడి ఉండగా ఆమెను పక్కకు వెళ్లాలి అని దానం చెప్పారు. దీంతో నీ పని చూసుకో అంటూ విజయారెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. అక్కడే ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని విజయారెడ్డిని సముదాయించారు. కార్యక్రమం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లుతున్న సమయంలో విజయారెడ్డి అనుచరులు, కాంగ్రెస్ మహిళా నేతలు పొన్నం ప్రభాకర్‌తో ఈ అంశంపై మాట్లాడగా తరువాత మాట్లాడుదామని చెప్పి వెళ్లిపోయారు. ఉద్దేశ్యపూర్వకంగానే విజయారెడ్డి ఫొటో పెట్టలేదని, పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తించడం లేదని ఆమె అనుచరులు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# తానూర్ లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

## అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

నిర్మల్ జిల్లా తానూరు అమృత్ తెలంగాణ మార్చ్ 3 తానూర్ మండలంలోని దాగం గ్రామానికి చెందిన కళాబాయి కి కొద్ది రోజుల క్రితం ఆరోగ్యం బాగాలేదు అని మండల నాయకులు మాజీ ఎమ్మెల్యే జీ విట్టల్ రెడ్డి, దృష్టికి తీసుకురాగా విషయాన్ని లిమన నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క గారి దృష్టికి తీసుకువెళ్లి నిమ్స్ ఆస్పత్రిలో సుమారు 1,50,000 LOC ని ఇప్పించి ఆపరేషన్ చేయించడం జరిగింది. ఈరోజు వారి ఇంటికి వెళ్లి ఆరోగ్యం ఎలా ఉంది అని అడిగి రావడం జరిగింది.మాజీ శాసనసభ్యులు గారి వెంటమాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోత రెడ్డి ,సీనియర్ నాయకులు గోవింద్, మాధవరావు, శంకర్,దిగంబర్, బాపూరావు పటేల్,సాయినాథ్ తదితరులు ఉన్నారు.

# మణిపూర్‌లో జాతి హింసకు రెండేళ్లు.. ఇంఫాల్‌లో బంద్



ఇంఫాల్: అమృత్ తెలంగాణ:మణిపూర్‌లో మైతీ, కుకీ జాతుల మధ్య హింస మొదలై రెండేళ్లు పూర్తయ్యాయి. జాతి హింస రెండో ఏడాది సందర్భంగా శనివారం ఇంఫాల్ లోయలో 'సింత లెప్పా'గా వ్యవహరించే బంద్ పాటించారు. దీంతో రోజువారీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. విద్యా, వ్యాపార సంస్థలను మూసివేశారు. ప్రజా రవాణా సేవలను నిలిపివేశారు. అశాంతి తలెత్తే అవకాశం ఉండటంతో ఇంఫాల్ అంతటా భద్రతా దళాలను మోహరించారు. కాగా, మణిపూర్ సమగ్రతపై సమన్వయ కమిటీ శనివారం ఖుమాన్ లాంపక్ స్టేడియంలో మణిపూర్ పీపుల్స్ కన్వెన్షన్ నిర్వహించింది. ప్రజలు రోజువారీ కార్యక్రమాలను నిలిపివేసి ఈ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేసింది. మణిపూర్‌లో కొనసాగుతున్న సంక్షోభంపై చర్చించడంతోపాటు హింసాకాండలో మరణించిన వారికి కొవ్వొత్తుల ర్యాలీతో నివాళి అర్పించనున్నారు. మరోవైపు కుకీ, జో ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న స్వదేశీ గిరిజన నాయకుల వేదిక శనివారాన్ని 'విభజన దినోత్సవం'గా పాటించింది. జాతుల సంఘర్షణకు ఏకైక పరిష్కారం ప్రత్యేక పరిపాలన అని ఈ తెగలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే తమను కుకీల్లో కలపడానికి ఇష్టపడని థాడౌ కమ్యూనిటీకి చెందిన థాడౌ ఇన్పి మణిపూర్ (టీఐఎం) మే 3ను 'శాంతి దినోత్సవం'గా జరుపుతున్నది. కాగా, ఆదిపత్య మైతీ తెగకు ఎస్టీ హోదాను అధికార బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని కుకీలు తీవ్రంగా వ్యతిరేకించారు. పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో 2023 మే 3 నుంచి మైతీ, కుకీ జాతుల మధ్య ఘర్షణ మొదలైంది. రెండేళ్లుగా కొనసాగిన హింసాకాండలో 250 మందికిపైగా మరణించగా సుమారు 60,000 మంది నిరాశ్రయులయ్యారు. అయితే హింసను ప్రేరేపిస్తున్నట్లుగా వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 9న సీఎం ఎన్ బిరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. మణిపూర్‌లో శాంతిభద్రతల పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సిఫార్సుతో ఫిబ్రవరి 13 నుంచి రాష్ట్రపతి పాలన అమలవుతున్నది.

# వీక్లీ పరేడ్ వల్ల పోలీసు సిబ్బందికి మంచి ఆరోగ్యం

## విధినిర్వహణ ఎంత ముఖ్యమో, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం

## నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్...





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లా పోలీస్ సాయుధ దళ ముఖ్య కార్యాలయం పరేడ్ గ్రౌండ్ నందు పోలీసు సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్ ను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...

వీక్లీ పరేడ్ అనేది సిబ్బందికి, క్రమ శిక్షణ, ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందని, సమయం దొరికినప్పుడు సిబ్బంది అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యం అని, మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విదులు నిర్వహించడానికి మంచి అవకాశం ఉంటుంది. ఫిట్నెస్ ను అనునిత్యం కాపాడుకోవాలన్నారు. ఈ పరేడ్ లో ఏఎస్పీ రాజేష్ మీన ఐపిఎస్, ఇన్స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రేమ్ కుమార్, ప్రవీణ్ కుమార్, కృష్ణ ,ఆర్.ఐ లు రాం నిరంజన్ రావు, శేఖర్, రమేష్ , రామ కృష్ణ, ఎస్ఐ లు , ఆర్.ఎస్ఐ లు, ప్రొబేషనరీ ఎస్ఐ లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ఏకకాలంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిది లో నాఖాబంది : జిల్లా ఎస్పి డా. జానకి షర్మిల ఐపిఎస్



నిర్మల్ SP మేడం ఆదేశాల ప్రకారంpembi మండల పోలీస్ స్టేషన్ పరిధిలో pembi పోలీస్ సిబ్బంది తో కలిసి Patrol bunk మరియు Bus stand pembi వద్ద నాఖబందీ నిర్వహించడం జరిగింది నాకబంధీలో భాగంగా వాహనాల తనిఖీ చేయడం జరిగింది.డ్రంకన్ అండ్ డ్రైవ్ చేసిన వ్యక్తుల పై కేసులు నమోదు చేయడం , మైనర్ డ్రైవింగ్ కేసులు , సరైన పత్రాలు లేని వారి వాహనాల పై స్పాట్ చలన్ నమోదు చేయడం జరిగింది.





నిర్మల్ SP మేడం ఆదేశాల ప్రకారం నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో CI గారు, SI లు మరియు పోలీస్ సిబ్బంది తో కలిసి మంజులపూర్ వద్ద నాఖబందీ నిర్వహించడం జరిగింది నాకబంధీలో భాగంగా వాహనాల తనిఖీ చేయడం జరిగింది. డ్రంకన్ అండ్ డ్రైవ్ చేసిన వ్యక్తుల పై కేసులు నమోదు చేయడం , మైనర్ డ్రైవింగ్ కేసులు , సరైన పత్రాలు లేని, సరైన నెంబర్ ప్లేట్ లేని వారి వాహనాల పై స్పాట్ చలన్ నమోదు చేయడం జరిగింది.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లా ఎస్పి డా. జానకి షర్మిల ఆదేశాల మేరకు భైంసా ఎ.ఎస్పి. అవినాష్ కుమార్ ఐపిఎస్ మరియు నిర్మల్ ఏ.ఎస్పి రాజేష్ మీన ఐపిఎస్ ల పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పోలీస్ సిబ్బంది మరియు జిల్లా ఎఆర్ సిబ్బంది తో శనివారం సాయత్రం ఒకేసారి నాఖాబంది నిర్వహించారు . సరియైన ఆధారాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు పట్టుకోవటం జరిగింది. ఇటీవల కాలంలో రోడ్డుప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణం మద్యం మత్తులో వాహనాలు నడపడం ఒకటైతే మరొకటి ర్యాష్ డ్రైవింగ్, ఇన్సూరెన్స్ లేని వాహనాల వాళ్ళ జరిగే ప్రమాదాలలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి ఎటువంటి ఆర్దిక సహాయం అందదు. ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీసులు ఎస్పి గారి ఆదేశాలతో ప్రతిరోజు నగరంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అన్ని లాడ్జ్ లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రనే మరియు రోడ్డు ప్రమాదాల నియంత్రనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఒకేసారి నాఖబంది నిర్వహించటం జరిగింది. ఈ తనిఖీల్లో అవినాష్ కుమార్ ఐపిఎస్, రాజేష్ మీన ఐపిఎస్, జిల్లాలోని ఇనస్పెక్టర్ లు, ఎస్ఐ లు , ప్రొబేషనరీ ఎస్ఐ లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

జిల్లాలో 295 మైనర్ డ్రైవింగ్ చేసిన వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్

జిల్లాలో వారం రోజుల పాటు జరిగిన స్పెషల్ మైనర్ డ్రైవింగ్ డ్రైవ్.

వారం రోజులలో 295 వాహనాలు స్వాధీనం.

ఈసారి మొదటి తప్పుగా కౌన్సిలింగ్ ద్వారా విడిచి పెట్టడం, ఇకనుండి తల్లిదండ్రులపై కేసు నమోదు.

మైనర్లు వాహనం నడపడం వల్ల ప్రమాదాలకు గురికావడం, ప్రమాదాలను గురిచేయడం జరుగుతుంది.

18 సం" పైబడిన లైసెన్స్ లేని వారు లైసెన్సును పొందాలి, తగిన సహాయం అందజేస్తా.





మైనర్లు డ్రైవింగ్ చేసిన తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : 18 సంవత్సరముల లోపు పిల్లలు మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కాకుండా జిల్లాలో మొట్టమొదటిసారిగా మైనర్ డ్రైవింగ్ చేసిన తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపిఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని తల్లిదండ్రులకు యువతకు మైనర్లకు అవగాహన కార్యక్రమం కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ చేయడం నేరమని, చట్టరీత్యా ఇకనుండి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. మైనర్లకు డ్రైవింగ్ ఇచ్చిన వాహన యజమానులు తల్లిదండ్రులు కేసులలో భాగస్వామ్యం అవుతారని తెలిపారు. ఒకవేళ మైనర్ తెలియక ప్రమాదాలకు కారణమైతే ఇన్సూరెన్స్ రాకుండా పోతుందనే విషయాన్ని తెలియజేశారు. మధ్యతరగతి కుటుంబ సభ్యులు 18 సంవత్సరాల పైబడిన పిల్లలకు డ్రైవింగ్ లైసెన్సును తీసుకోవాలని తగిన సహాయం అందజేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజులపాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 295 మైనర్లు వాహనాలతో పట్టుబడ్డారని, 295 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని, ప్రస్తుతం వారి తల్లిదండ్రులకు వాహనాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. వారందరి తల్లిదండ్రులకు ఈరోజు హెడ్ క్వార్టర్స్ నందు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు నడిపే శక్తి ఉండదని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రిపూట, రోడ్లపై అనవసరంగా తిరగకుండా ఉండాలని గమనించాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమై ప్రాణ నష్టం సంభవిస్తుందని, లేదా సరిగ్గా వాహనాలు నడిపే వారి కి ప్రమాదం చేసి వారి ప్రాణాలకు కుటుంబ సభ్యులకు హాని కలిగించే విధంగా గురవుతున్నారనే, విషయాన్ని తెలియజేశారు. ఎట్టి పరిస్థితుల్లో తల్లిదండ్రులు పిల్లలు వాహనాలు నడపడానికి ప్రోత్సహించకుండా ఉండాలని కఠినంగా తెలియజేశారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పకుండా లైసెన్సును కలిగి ఉండాలని లైసెన్సు తీసుకునే క్రమంలో రోడ్డు నియమాలను నిబంధనలను నేర్చుకొని లైసెన్స్ ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పిఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు సిహెచ్ కరుణాకర్, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, బి శ్రీపాల్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దారిదోపిడి కేసులో నలుగురు యువకులు అరెస్ట్ - ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్

లారీ అద్దాలు పగలగొట్టి, డ్రైవర్ వద్ద డబ్బుకాజేసిన నలుగురు.

ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు.

బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు, యువకుల అరెస్ట్.



అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ : వివరాలలో గురువారం మే 2 తారీకు రోజు ఉత్తరప్రదేశ్ కు చెందిన లారీ డ్రైవర్ పురా?న్ అలీ ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితులు నలుగురు పట్టుబడ్డారని ఉట్నూరు ఎఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్ తెలిపారు.

నిందితుల వివరాలు

1) షేక్ సోహెలుద్దీన్, డ్రైవర్, ఇచ్చోడా.
2) సలాం శ్రావణ్ కుమార్, అడేగం, ఇచ్చోడా.
3) షేక్ రహీల్ షేక్ గఫార్, కిన్వర్ట్, మహారాష్ట్ర.
4) సలాం ఏ అబ్దుల్ యాసిర్, సిరి చల్మా గ్రామం , ఇచ్చోడ.

నలుగురు నిందితులు రెండవ తారీఖున హర్యానా దాబా వద్ద ఆగి ఉన్న లారీ అద్దాలను పగలగొట్టి బాధితుడి వద్ద నుండి ఆరున్నర వేల రూపాయలను దారిదోపిడి చేశారని తెలిపారు. నిందితులను పట్టుకొని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. నిందితులపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నందు 141/2025, అండర్ సెక్షన్ 309 (4) బిఎన్ఎస్ తో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. తప్పు చేసే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. యువత ను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని చెడు మార్గంలో ప్రయాణించకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

# ఎండలు, వడగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్

జగిత్యాల, మే 03 :అమృత్ తెలంగాణ: ఎండ తీవ్రత బాగా పెరిగిన నేపథ్యంలో వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బీ సత్య ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు, సూచనలు పాటించాలని చెప్పారు. చిన్నారులు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తత అవసరమని చెప్పారు. ఎప్పటికప్పుడు మంచి నీరు, గ్లూకోజ్, ఎలక్ట్రోరల్ పౌడర్ వంటివి అందించాలని ఆదేశించారు. వీలైనంత వరకు వృద్ధులు, చిన్నారులను గాలి ఆడే ప్రదేశాల్లో ఉండేలా చూడాలని, జాగ్రత్తలు పాటించడం ద్వారా వడదెబ్బ మరణాలు అరికట్టవచ్చని, ఎండతీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి (104 డిగ్రీలఫారన్ హీట్) మెదడు మీద ప్రభావం చూపుతుందని తెలిపారు. చెమట, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక్షంగా అపస్మారక స్థితి, ఎండలో బయటకు వెళ్లినప్పడు ఈ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా గొడుగు వాడడం, తెలుపురంగు లేదా పలుచని చేనేత వస్త్రాలు ధరించాలని చెప్పారు. తలకు టోపీ కానీ రుమాలు కానీ వాడాలని, వేడిగాలులు తగలకుండా చూసుకోవాలని, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనులు చేయవద్దని సూచించారు. దూర ప్రయాణాలు చేయవలసి వచ్చినప్పుడు ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తరువాత చేయాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి తీసుకు వెళ్లాలని, చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో శరీరం తుడవాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు అలాగే చేస్తూ ఉండాలని సూచించారు.



అధికారులు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, మజ్జిగ వంటివి సరఫరా చేయాలని కోరారు. వడగాలుల ప్రభావం సామాన్యప్రజలపై పడకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాల చెప్పారు. ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా వేడి ప్రదేశాల్లో పనిచేసే కార్మికులను రెండు బృందాలుగా విభజించి కనీసం గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా రొటేషన్ పద్ధతి అవలంభించేలా చూడాలని సూచించారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్ధనా స్థలాల వంటి పబ్లిక్ ప్రాంతాలలో అవసరమైన షెల్టర్లు, తాగునీరు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

# జిల్లాలో పదిమంది ప్రొఫెషనల్ ఎస్సైలు, 11 మంది రెగ్యులర్ ఎస్ఐల బదిలీలు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : పదిమంది ప్రొఫెషనరీ ఎస్ఐలకు నెల రోజులపాటు ఎస్ హెచ్ ఓ గా శిక్షణ.

11 మంది ఎస్ఐలకు స్థాన చలనం.

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.

స్థాన చలనం పొందిన ఎస్సైలు.

1) ఏ తిరుపతి - ఇచ్చోడా పోలీస్ స్టేషన్ నుండి డిస్టిక్ స్పెషల్ బ్రాంచ్, అటాచ్ టు ఆదిలాబాద్ టు టౌన్.
2) వి పురుషోత్తం - జైనథ్ పోలీస్ స్టేషన్ నుండి ఇచ్చోడా పోలీస్ స్టేషన్.
3) పి దివ్యభారతి - బేల పోలీస్ స్టేషన్ నుండి తాంసి పోలీస్ స్టేషన్.
4) కే నాగనాథ్ - విఆర్ ఆదిలాబాద్ - బేల.
5) డి రాధిక - తాంసి నుండి తలమడుగు.
6) పి గౌతమ్ - గుడిహత్నూర్ నుండి జైనథ్ పోలీస్ స్టేషన్.
7) బి అంజమ్మ - తలమడుగు నుండి డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ ఆదిలాబాద్, అటాచ్ టు ఆదిలాబాద్ వన్ టౌన్.
8) డి శివరాం - సిరికొండ పోలీస్ స్టేషన్ నుండి ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్ అటాచ్.
9) జి అప్పారావు - ఆదిలాబాద్ హెడ్ కోటర్స్ నుండి ఉట్నూర్ పోలీస్ స్టేషన్ అటాచ్.
10) డి పద్మ - వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ఇచ్చోడ పోలీస్ స్టేషన్ అటాచ్.
11) కే రవీందర్ ఆదిలాబాద్ టు టౌన్ నుండి మావల పోలీస్ స్టేషన్ అటాచ్.

నెల రోజులపాటు ఎస్ హెచ్ ఓ లుగా విధులు నిర్వహించనున్న ప్రొఫెషనరీ ఎస్సైలు.

1) కొమ్ము అఖిల్ - నార్నూర్ పోలీస్ స్టేషన్.
2) గడ్డం రమ్య - జైనథ్ పోలీస్ స్టేషన్.
3) బోడ పీర్ సింగ్ నాయక్ - భీంపూర్ పోలీస్ స్టేషన్.
4) ఎస్ శ్రీ సాయి - సిరికొండ పోలీస్ స్టేషన్.
5) పిల్లి ప్రణయ్ కుమార్ - మావల పోలీస్ స్టేషన్.
6) సతలపల్లి పూజ - ఉట్నూర్ పోలీస్ స్టేషన్.
7) గడ్డల సంజయ్ కుమార్ - ఇచ్చోడ పోలీస్ స్టేషన్.
8) కోట రాజశేఖర్ రెడ్డి - బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్.
9) ఎస్ జీవన్ రెడ్డి - గాదిగూడ పోలీస్ స్టేషన్.
10) యనకి మధు కృష్ణ - గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్.

# సిబ్బంది విధులను క్రమశిక్షణతో నిర్వహించాలి

## సిబ్బంది ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి.

**విధులలో చెడు వ్యసనాల ను కలిగి ఉండరాదు.**

**అనవసరంగా తెలియని వ్యక్తులకు పూచికత్తు (షూరిటీ) ఇవ్వకుండా ఉండటం మంచిది.**

**వయసు పైబడిన సిబ్బందికి ప్రత్యేకంగా యోగ సాధన**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**







పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా పోలీస్ అధికారి అఖిల్ మహాజన్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : సిబ్బంది విధులను నిర్వర్తించే క్రమంలో క్రమశిక్షణతో ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ప్రతి శనివారం రోజున స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు సిబ్బంది ప్రతి ఒక్కరికి పరేడ్ నిర్వహించబడుతుందని, పరేడ్ వల్ల సిబ్బంది ఒకరి మధ్య ఒకరికి మధ్య సత్సంబంధాలు మెరుగుపడతాయని, అదేవిధంగా సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వ్యాయామం చేస్తూ ఉండాలని తెలిపారు. పరేడ్లో మొదటగా రిజర్వ్ ఇన్స్పెక్టర్ టి మురళి జిల్లా ఎస్పీకి గౌరవ వందనాన్ని సమర్పించి ఏడు ప్లాటూన్ లతో కూడిన పరేడ్లో విడతలవారీగా ప్రత్యేక గౌరవ వందన సమర్పించారు. తదుపరి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పరేడ్ వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచిస్తూ, సిబ్బంది విధులలో చెడు వ్యసనాలను సేవించకుండా ఉండాలని సూచించారు. పోలీసు వ్యవస్థకు క్రమశిక్షణ తప్పనిసరిని క్రమశిక్షణ ఉల్లంఘన జరిగితే శాఖపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. సిబ్బంది చేసిన పరేడ్ మరింత ఉత్సాహంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఇతరుల ఇతర వ్యక్తులకు తెలియని వ్యక్తులకు పూచికత్తులు (షూరిటీ) ఇవ్వకుండా ఉండాలని తెలిపారు. 50 ఏళ్లు పైబడిన సిబ్బందికి ప్రత్యేకంగా పరేడ్కు బదులు యోగ శిక్షణను అందించడం జరిగింది. పరేడ్లో భాగంగా సిబ్బంది అందరికీ ఆయుధాలపై మరియు వాటి వినియోగంపై, ట్రాఫిక్ సిబ్బందికి సిగ్నల్స్ పై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్, కే ఫణి ధర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు టి మురళి, బి శ్రీపాల్, ఎన్ చంద్రశేఖర్, ఎస్ఐ మావల వి విష్ణువర్ధన్, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విధులకు ఆటంకపరిచిన వ్యక్తి అరెస్టు రిమాండ్ తరలింపు.

**మోచిగల్లి కి చెందిన ఘటికీ ముఖేష్ అరెస్ట్.**

**డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లో సహకరించనందున, ఎస్ఐ విధులకు ఆటంకపరిచిన నిందితుడు.**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ : పట్టణంలో విధులలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్ఐ కి ఆటంకపరచి నా వ్యక్తి గటిక ముఖేష్ ను అరెస్టు చేయడం జరిగిందని ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలియజేశారు. మే2 రాత్రి రవీంద్ర నగర్ నందు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్ఐ తో వాగ్వాదానికి దిగి పోలీస్ స్టేషన్లో ఎస్సై విధులు నిర్వర్తించకుండా ఆటంకపరిచిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. ఇతనిపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 219/25తో అండర్ సెక్షన్ 121 132 బి ఎన్ ఎస్ సెక్షన్లతో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలి : జిల్లా పాలనాధికారి రాజర్షి షా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : వేసవి లో భానుడి ప్రతాపం రోజు రోజుకి తీవ్రరూపం దాల్చి ప్రజలను అనారోగ్యానికి గురయ్యేలా చేస్తున్న నేపథ్యంలో వేసవికాలం ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్య వడదెబ్బ. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా బయట పనికి వెళ్లే వాళ్లే కాదు.. ఇంట్లో ఉండే వృద్ధులు, పిల్లలు కూడా వడదెబ్బకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయని ఈ సందర్భంగా కొన్ని జాగ్రత్తలు పాటించి వడదెబ్బ తగలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే.. ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉ ంటుందని, వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండాలంటే, శరీరానికి తగినంత నీరు అందించడం, ఎండ తగలకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవడం,తేలికైన దుస్తులు ధరించడం, మధ్యాహ్న వేళలో బయటకు వెళ్లకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లవలసివస్తే గొడుగు , వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవడం ముఖ్యం.

వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు:

శరీరాన్ని హైడ్రేట్గా ఉంచుకోండి:

వేసవిలో శరీరానికి తగినంత నీరు అందించడం చాలా అవసరం. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి, ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు వంటివి.

లఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ తగలవచ్చు. కాబట్టి, నీడలో ఉండటం, టోపీ, గొడుగు వంటివి ఉపయోగించడం, సూర్యరశ్మిని నిరోధించే దుస్తులు ధరించడం మంచిది.

తేలికైన దుస్తులు ధరించండి:

వేసవిలో తేలికపాటి వస్త్రాలను ధరించడం మంచిది. రంగుల దుస్తులను ధరించడం వల్ల సూర్యరశ్మి శరీరంపైకి ఎక్కువగా పడుతుంది.

మధ్యాహ్న వేళలో ఎండ చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ఆ సమయంలో బయటకు వెళ్లడం మంచిది కాదు. వీలైతే ఉదయం, సాయంత్రం గాలి చల్లగా ఉన్నప్పుడు బయటకు వెళ్లడం మంచిది.

వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోండి:

వడదెబ్బ లక్షణాలు (తలనొప్పి, వాంతులు, మైకము, అధిక జ్వరం, తల తిరగడం, స్పృహ కోల్పోవడం) కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

పిల్లలు వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధ:

పిల్లలు వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకూడదు. వీలైనంతవరకు ఇంట్లోనే ఉంచడం మంచిది.

మందులు సక్రమంగా తీసుకోండి:

ఏదైనా మందులు తీసుకుంటున్నట్లయితే, డాక్టర్ సూచనల ప్రకారం మందులు తీసుకోవడం చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# NEET (UG)-2025 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు

**పరీక్షా కేంద్రాల వద్ద 163 BNSS అమలులో ఉంటుంది**

**జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాలలో హాజరు కానున్న 1659 మంది అభ్యర్థులు**

**పరీక్షా కేంద్రాల వద్ద 150 మంది సిబ్బందితో బందోబస్తు ప్రక్రియ.**

**NEET పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వర్తించే అధికారులతో సమావేశం**

**రేపటి విధులలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచన.**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఆదిలాబాద్ పట్టణం నందు ఆదివారం, నెల 4వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు జరగనున్న NEET ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు. పట్టణంలోని 7 పరీక్షా కేంద్రాలయిన

1.తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలురు
2.సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాల బాలికలు
3.ప్రభుత్వ బాలికల పాఠశాల భుక్తాపూర్
4.ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆర్ట్స్, కామర్స్
5.బంగారి గూడ తెలంగాణ మోడల్ స్కూల్
6.,7 తెలంగాణ రెసిడెన్షియల్ మైనార్టీ స్కూల్. లో 2 కేంద్రాలు ఏర్పాటు చేయడం.

వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించబోయే అధికారులతో ఈరోజు సాయంత్రం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా ఎస్పీ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేయడం జరిగింది. సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద పద్ధతి ప్రకారం అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని తెలిపారు. మహిళలకు, పురుషులకు వేరువేరుగా ప్రత్యేకంగా తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని. పరీక్షా కేంద్రాలను ఉదయం ఏడు గంటలకు పూర్తిగా తనిఖీ చేయాలనే సూచించారు. సరైన ధ్రువ పత్రాలు లేనిదే పరీక్షా కేంద్రాలలోనికి ఎవరిని అనుమతించకూడదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) అమలులో లో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లో ఇంటర్నెట్ సెంటర్లకు అనుమతి ఉండదని తెలిపారు. సిబ్బంది మొబైల్ ఫోన్లను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకువెళ్లరాదని సూచించారు. సిబ్బంది ఎండ తీవ్రతను బట్టి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎస్కార్ట్ సిబ్బంది జవాబు పత్రాలు, ప్రశ్న పత్రాలు పూర్తి అయ్యేంతవరకు చివరి వరకు బందోబస్తులో ఉంటారని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలను చేయడం జరిగింది.

అభ్యర్థులంతా అడ్మిట్ కార్డు నందు సూచించబడిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడును.

పరీక్ష సమయం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగును.

పరీక్షా కేంద్రానికి హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను గానీ, ఆభరణాలను గానీ, బ్యాగులు లాంటివి అనుమతించబడవు.

పరీక్ష కేంద్రం ప్రవేశద్వారం వద్ద పురుషులను,స్త్రీలను వేరు వేరుగా క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు.

అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటు, గుర్తింపు కార్డు మరియు రెండు పాస్పోర్ట్ ఫోటోలు తమ వెంట తీసుకురావాలి.

పరీక్షా కేంద్రాలు పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయి.

పరీక్షా కేంద్రాల నుండి 200 మీటర్ల దూరంలో ఎవరూ ఉండరాదు.

పరీక్ష రోజున పరీక్షా కేంద్రాలకి దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లు,కంప్యూటర్ సెంటర్లు మూసివేయబడును.

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రతి ఒక్కరిని ముందుగానే బయోమెట్రిక్ ద్వారా చెక్ చేసి, పరీక్ష రాసే సమయంలో వీడియోగ్రఫీ చేయబడును.

పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులకు మంచినీటి సౌకర్యం మరియు అత్యవసర వైద్య సేవలకు గాను ఏర్పాటు చేయడం జరుగుతుంది.

అభ్యర్థులు పరీక్ష రాయడానికి ఎలాంటి పెన్నులు, పెన్సిల్స్ తీసుకురావద్దు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు ప్రతి ఒక్కరికి బ్లాక్ బాల్ పెన్ ఇస్తారు.

పరీక్షకు హాజరయ్య అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లకు సంబంధించిన ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడవు.

# కెస్లాపూర్ లో వేసవి క్రీడా శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీ గోడెమ్ నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్. ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్ర



కేస్లాపూర్ లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ లో శనివారం MP గొడెం నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, శాసన సభ్యులు వెడ్మ బొజ్జ పటేల్ మాట్లాడుతున్న దృశ్యం



రిబ్బన కట్ చేస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : శనివారం సమ్మర్ క్యాంప్ శిక్షణ కార్యక్రమం లో భాగంగా కెస్లాపూర్ లో వేసవి క్రీడా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఈ నెల మే 1 నుండి మే 31, 2025వరకు 6 నుండి 14 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన బాలబాలికలకు , యువతకు వివిధ క్రీడలలో వేసవి క్రీడా శిక్షణ శిభిరాల ను నిర్వహించుటం జరుగుతుందన్నారు. మే 1 నుండి 31 వరకు ప్రతి రోజు ఉ దయం 6.00గంటల నుండి 8.00గంటల వరకు , సాయంత్రం 5.00 గంటల నుండి 7.00గంటల వరకు ఆయా వివిధ రకాల క్రీడలలో నిర్వాహకులు శిక్షణ ఇస్తారున్నారు

ఈ సందర్భంగా క్రీడా సామాగ్రిని అందించారు

క్రీడా శిభిరాల నిర్వహాకులు/కోచ్లు వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని తమ తమ శిక్షణ శిభిరము వద్ద తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగు నీటి సౌకర్యాన్ని కల్పించి, ఓ.ఆర్.యస్., ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు తమ సమయాన్ని వృదా చేయకుండా శిక్షణ శిభిరాల కు హాజరై వారి ప్రతిభను వెలికితీసి సాన బెట్టేందుకే రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ శిభిరాల ను నిర్వహిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను శిభిరాల కు పంపి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వేసవి శిక్షణ ను సద్వినియోగం చేసుకొని క్రీడా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని , జాతీయ స్థాయిలో అవార్డులను అందుకునే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో dyso వెంకటేశ్వర్లు, పార్థసారథి, గ్రామ పటేల్ , కొచ్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# విద్యా, వైద్య రంగాల్లో దేశానికి తెలంగాణ దిక్సూచి.. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్




సారంగాపూర్, మే 3:అమృత్ తెలంగాణ: విద్యా, వైద్య రంగాల్లో దేశానికి దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం మారిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బీర్ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ విద్యార్థిని కే అమూల్య 580 మార్కులు సాధించింది. కాగా అమూల్యతో పాటు ఉత్తమ మార్కులు సాధించిన అశ్విత 561, ఎం శ్రీహిత 551 మార్కులు సాధించగా ఎమ్మెల్యే క్వార్టర్ లో సంజయ్ కుమార్ ను వారు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేసి సౌకర్యాలు కల్పించారని, ఎన్నో ఏళు గా పాఠశాలలో సమస్యతో ఉన్న స్కావెంజర్ లను కూడా నియమించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం,విద్యఅందిస్తున్నట్లు, మహిళా సంఘాల ద్వారా విద్యార్థులకు సరైన ఏక రూప దుస్తులు తయారీకి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ నియామకాలతో విద్యార్థులకు సరైన బోధన సిబ్బంది ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణతే సాక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# తలపై రాయితో కొట్టి.. పెద్దపల్లిలో మహిళ దారుణ హత్య

రామగిరి:అమృత్ తెలంగాణ: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్లలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. మంచిర్యాల జిల్లా ఐబీ తాండూరుకు చెందిన మోటం సమ్మక్క అనే మహిళ.. భర్త కొన్ని రోజుల క్రిత మరణించాడు. దీంతో ఆమె లక్షింపేట మంటలం దండేపల్లికి చెందిన కనకరాజు అనే వ్యక్తితో సహజీవనం చేస్తున్నది. కల్వచర్ల గ్రామంలో నివాసం ఉంటున్న సమక్క.. రెండు రోజుల క్రితం కనకరాజుతో కలిసి తన చిన్నాన్న ఇంటికి వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న కనకరాజు, సమక్కకు మధ్య రాత్రి గొడవ జరిగింది. దీంతో ఆగ్రహం ఊగిపోయిన అతడు సమక్క తలపై ఇటుక రాయితో బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతించెంది. మృతురాలి బంధువులు పోలీసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేఇస దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి జిల్లా దవాఖానకు తరలించారు. కనకరాజు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# భూ భారతి రెవెన్యు సదస్సులు ఈ నెల 5వ తేది నుండి ప్రారంభం

**అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి :**
**గూగుల్ మీట్ ద్వారా తహసీల్దార్లకు దిశా నిర్దేశం**
**జిల్లా పాలనాధికారి రాజర్షి షా.**
**జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా భోరజ్ మండలం**
**భూ భారతి గ్రామ రెవెన్యు సదస్సులు భోరజ్ మండలం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక**
**మూడు టీములతో గ్రామ రెవెన్యూ సదస్సులు**
**భోరజ్ మండలం లో 28 గ్రామాలు**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : భూ భారతి గ్రామ రెవెన్యు సదస్సులు ఈనెల 5 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ రెవెన్యు సదస్సులో భాగంగా జిల్లాలో బోరజ్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని , దీనికి సంబంధించి సదస్సులు నిర్వహించే చోట అన్ని ఏర్పాట్లు చేయాలని శనివారం గూగుల్ మీట్ ద్వారా తహసీల్దార్ల కు పలు సూచనలు సలహాలు తో పాటు దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 20 వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఈనెల 5నుంచి 20వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని జిల్లా కేంద్రాలను మినహాయించి జిల్లాలో ఒక మండ లాన్ని పైలెట్‌గా తీసుకుని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వ హించి భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందని, ఈ నేపథ్యం లో భోరజ్ మండలాన్ని పైలెట్ గా తీసుకోవడం జరిగిందనీ అన్నారు.

ఈ సందర్భంగా భోరజ్ పైలెట్ లో మూడు టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు.

ల(గ్రామానికి వెళ్ళే ముందురోజు గ్రామాల్లో టామ్ టామ్ చేయించాలని, సంభందిత అధికారులు ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఉ ండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. అలాగే అన్ని రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని,, త్రాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు 28 గ్రామాల్లో సదస్సులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేయాలనీ అన్నారు. అలాగే హెల్ప్ డెస్క్, దరఖాస్తుల, రెవెన్యు సదస్సు ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. జూన్ 2 వరకు పైలెట్ ప్రాజెక్ట్ కింద వచ్చిన దరఖాస్తుల పరి ష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. భూ భారతి చట్టంలో దర ఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తులు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేయాలన్నారు. ప్రభుత్వ భూముల్లో పొజిషన్ లో ఉన్న రైతుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని,.పట్టాలు ఉండి పొజిషన్‌లో లేని దరఖాస్తులు కూడా పరిశీలించాలన్నారు. హై కోర్టు అనుమతులు రాగానే సాదాబైనామా దరఖాస్తులను పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణను పూర్తిచేయాలన్నారు. ఈ నెల చివరికల్లా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారం చూపాలన్నారు. గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, RDO వినోద్ కుమార్, తహసీల్దార్లు, AD సర్వే లాండ్, తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడపిల్లల పెళ్లికి ప్రభుత్వం నుంచి వచ్చే సాయం లబ్ధిదారులకు త్వరగా అందే విధంగా చూడాలని ఎమ్మెల్యే పాయల శంకర్



కళ్యాణ లక్ష్మి చెక్కులను అందిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ బోరజ్, బేల, ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాల కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ లబ్దిదారులకు ఆదిలాబాద్ లోని జెడ్పి సమావేశం మందిరంలో శనివారం చెక్కులను అందించారు. ఆడ పిల్లల పెళ్లి అంటే తల్లిదండ్రులకు సంతోషంగా ఉన్న వేద వారిలో ఆర్థిక సమస్య ఎక్కువగా పీడిస్తుందన్నారు. అలాంటి వేదింటి ఆడ బిడ్డ వెండ్లి కోసం ప్రభుత్వంలక్ష రూపాయలఆర్థిక సాయం అందిస్తుందన్నారు.ప్రభుత్వం అందించేపథకాలను వినియోగించుకోవాలని కోరారు.

# వ్యవసాయ భూముల పట్టాల సమస్య సదస్సులో ఎమ్మెల్యే పాయల్ శంకర్



అమృత్ తెలంగాణ అదిలాబాద్ వ్యవసాయ భూముల పట్టాల సమస్య సదస్సులో ఎమ్మెల్యే పాయల్ శంకర్ కొత్తగా ఏర్పడిన సత్నాల మండలం లోని మంగుర్ల మరియు సుందరగి గ్రామములో రైతుల భూములకు పట్టాలు లేక రైతులు చనిపోతే సాయం అందాకా ఇబ్బందులు పడ్డారు గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి చట్టం తో ఐన న్యాయం జరగలేదు కొత్తగా ఎర్పడిన ప్రభుత్వం భూభారతి చట్టం తో ఐనా ఇగ్రామ రైతులకు న్యాయం జరగాలి అని ఎమ్మెల్యే గారు అన్నారు ఈకార్యక్రమంలో ఆదిలాబాద్. RDO సత్నాల మండల్ మరో. మంగుర్ల సుందరగి గ్రామల రైతులు పాల్గొన్నారు

# మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి..

జమ్మికుంట, మే 3:అమృత్ తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్లో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో శాంతి చర్చల ఆవశ్యకతపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జస్టిస్ చంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆదివాసులకు ప్రత్యేక హక్కులు రాజ్యాంగం కల్పించిందని, కేంద్ర ప్రభుత్వం వారి హక్కులను విఘాతం కలిగించవద్దని కోరారు. కేంద్ర ప్రభుత్వం, మావోయిస్టులకు మధ్య చర్చలు జరిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మావోలు చర్చలకు సిద్ధంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం బలగాలను మోహరించి చంపి వేయడమే లక్ష్యంగా ముందుకు సాగడం ధర్మం కాదన్నారు. మావోలతో చర్చలు జరపాల్సిందేనని బలగాలను వెంటనే వెనక్కి తెప్పించాలని డిమాండ్ చేశారు. శాంతి చర్చల ప్రక్రియ కోసం అన్ని వర్గాలు గొంతు విప్పాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


---

# సీతకి వయసు తో వచ్చిన కష్టాలు పాపం..!



సీతారామం సినిమా తో తెలుగు లో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. హిందీలో ఈమె సినిమాల్లో ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయ్యింది.. అంతకు ముందే సీరియల్స్ లో కూడా ఈ అమ్మడు చాలానే పాపులారిటీని సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం దక్కిన స్టార్ డమ్.. సూపర్ హిట్ మాత్రం ఆమెకు ఇన్నాళ్ల సినీ కెరీర్ లో దక్కలేదనే చెప్పాలి. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన సీతారామం సినిమాలో సీత పాత్రకు అచ్చు గుద్దినట్లుగా అద్భుతంగా సెట్ అవ్వడంతో ప్రతి ఒక్కరు కూడా ఫిదా అయ్యారు.. ఇంకా కూడా అవుతూనే ఉన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుసగా సినీ ఆఫర్లు దక్కించుకుంటున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. ఒక పాత్ర కోసం వేశ్య గృహంలో ఉండాల్సి వచ్చిందని చెప్పిన మృణాల్ ఠాకూర్ కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్లు గురించి పలు ఆసక్తికర విషయాలను చెప్పింది. ఇదే సమయంలో ఆమె తన వయసు గురించి కాస్త అసహనంతో మాట్లాడింది. నా వయసు ప్రస్తావన వచ్చిన ప్రతి సారి కూడా చాలా మంది పెళ్లి గురించి అడుగుతూ ఉంటారని.. ప్రేమ లో పడలేదా అంటూ ఆశ్చర్యంగా ఫేస్ పెడతారు అంటూ మృణాల్ పేర్కొంది. నా వయసు 30 ఏళ్లు అంటూ చెప్పగానే మీరు పెళ్లి చేసుకోవాల్సిన సమయం వచ్చినట్లుంది.. పెళ్లి పై మీ యొక్క అభిప్రాయం అంటూ చాలా మంది ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు. ఎన్నో సార్లు సమాధానం చెప్పినా కూడా ప్రేమ గురించి నన్ను ఎప్పుడూ ఎవరో ఒకరు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రేమ గురించి నాకంటూ ఒక అవగాహణ ఉందని మృణాల్ పేర్కొంది.

# వెబ్ సిరీస్ లో ఊర్మిళ దుమారం తప్పదా?



బాలీవుడ్ బ్యూటీ ఊర్మిళ మండోత్కర్ నాలుగేళ్లగా సినిమాలకు దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. అవకాశాలు రాక...సరైసనన పాత్రలు దొరకక గ్యాప్ ఇచ్చిందా? అన్నది క్లారిటీ లేదు గానీ..ఊర్మిళ తెరపై ఎప్పుడు కనిపించినా ఓ సంచలనమే అన్నది వాస్తవం. యాభైకి చేరువలోనూ ఊర్మిళ ధగధగల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వెండి తెరపై మెరిసిన అమ్మడు బుల్లి తెరపైనా తనదైన మార్క్ వేసింది. పలు రియాల్టీ షోలను హోస్ట్ చేసి ఐడెంటీ వేసింది. ప్రస్తుతం డిడ్ సూపర్ మామ్స్ సీజన్ -3రని హోస్ట చేస్తోంది. తాజాగా ఊర్మిళ వెబ్ సిరీస్ లకు సై అనేసింది. 'తివారీ' అనే వెబ్ సిరీస్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేస్తుంది. తల్లి -కుమార్తె నేపథ్యంలో సాగే స్టోరీ కావడంతో ఆ రెండు పాత్రలు కూడా ఆమె పోషిస్తుందిట. పాత్రలకు సంబంధించి ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటుందిట. గత ఆరు నెలలుగా అదే పనిలో బిజీగా ఉ న్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పాత్రల గురించి స్పందించింది. ' నాలోని నటికి తివారీ సవాల్ విసురుతుంది. ఇందులో అనుబంధాలే కాదు.. ఊహించని మలుపు యాక్షన్ సన్నివేశాలు..రొమాంటిక్ సీన్లు ఉంటాయని' రివీల్ చేసింది. మొత్తానికి ఊర్మిళ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ గట్టిగానే ఊపేటట్లు కనిపిస్తుంది. స్టార్ హీరోయిన్ గా కొనసాగినంత కాలం బాలీవుడ్ ని ఓ ఊపు ఊపేసింది. ఆ తర్వాత ఒక్కసారిగా చల్లబడింది. కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం లేదు. ఈ క్రమంలో కొంత గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇప్పుడు ఓటీటీని షేక్ చేయడానికి రెడీ అవుతోంది. ప్రస్తుతం వెబ్ సిరీస్ ల్లోకి స్టార్ హీరోయిన్లు సైతం ఎంట్రీ ఇస్తున్నారు. ఈక్రమంలో అక్కడా పోటీ వాతావరణం కనిపిస్తుంది. ఒకరికొకరు పోటీ పడుతూ సత్తా చాటుతున్నారు. వెండి తెరను మించి ఓటీటీ బోల్డ్ కంటెంట్ లో విచ్చలవిడిగా నటించడానికి ఎలాంటి అడ్డంకులు పెట్టడం లేదు. ఛాన్స్ ఇవ్వాలే గానీ.. దర్శకుడి సృతజాన్మతకని మించి పెర్ఫార్మెన్స్ ఇస్తున్నారు. మరి ఆ రకంగా ఊర్మిళ కూడా రేసులో నిలుస్తుందా? అన్నది చూడాలి. ఊర్మిళ తెలుగులోనూ అంతే ఫేమస్. ఆమె 'అంతం'..'గాయం'..'అనగనగా ఒక రోజు' లాంటి తెలుగు చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే.

# మంచి ఆఫర్లు రాబడుతున్న 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్'



'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా అక్టోబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియా సర్కిల్స్ లో మంచి సంచలనం సృష్టించింది. చిత్రాన్ని ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోవడానికి మేకర్స్ తమ ప్రయత్నాలను రెట్టింపు చేస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన క్రేజీ ట్రైలర్ మరియు ప్రమోషనల్ సాంగ్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇది బయ్యర్ల నుండి మంచి ఆఫర్లు రావడానికి దోహదపడినట్లు సమాచారం. 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' చుట్టూ నెలకొన్న హైప్ దృష్ట్యా ఈ సినిమా ఆంధ్ర నైజాం మరియు సీడెడ్ ఏరియాలకు బయ్యర్లు సుమారు 3 కోట్ల కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. యునిక్ కాన్సెప్ట్.. ప్రత్యేకమైన కథనం ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఇస్తుందని సినీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సినిమా ప్రీ క్లైమాక్స్ పార్ట్ ఎప్పుడూ చూడని ఎమోషన్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని అంటున్నారు. అలాగే సంగీతం సినిమాటోగ్రఫీ మరియు క్రిస్పీ ఎడిటింగ్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని పేర్కొంటున్నారు. దీన్ని బట్టి చూస్తే 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా మంచి బిజినెస్ డీల్ తో ముగించే అవకాశం ఉందని అనుకోవచ్చు. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ లో విశ్వంత్ - మాళవిక సతీషన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఫ్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ మరియు స్వస్తిక సినిమా బ్యానర్స్ పై నిరంజన్ రెడ్డి - వేణు మాధవ్ పెద్ది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.






ఈశాన్యామహేశ్వరి హాట్ ఇన్ రెడ్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com